క్లుప్తంగా

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



ఇస్లావత్ తండాలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న డాక్టర్ ఆనంద్

త్రిపురారం : మండలంలోని ఇస్లావత్ తండాలో అభయ ఆంజనేయ స్వామిదేవాలయంలో మంగళవారం ప్రపంచ ఎన్‌జీఓ దినోత్సవాన్ని బంజారా మహిళా ఎన్‌జీఓ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆ ఎన్‌జీఓ ఫౌండర్ డాక్టర్ ఆనంద్, హరిప్రియలు పూజలు నిర్వహించారు. అనంతరం ఇస్లావత్ తండా పరిధిలోని విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుజాత, చిన్న గోపాల్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

డిండి : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండ మండలం చింతబావి నుండి ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లలో మండల కేంద్రానికి ఇసుకను తరలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మార్గమధ్యలోని చెర్కుపల్లి, పెద్ద తండా సమీపంలో దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఇందుకు కారణమైన దొడ్డు రమేష్, నోముల రవీందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.రాజు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్, హెచ్ఎం

హాలియా : రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు హాలియా పట్టణంలోని ఆకాంక్ష ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఆర్ దత్తు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్ రావు, హెచ్ఎం రవీందర్ తెలిపారు. మంగళవారం స్థానికంగా వారు మాట్లాడుతూ 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 క్రికెట్ పోటీలకు నల్లగొండ జిల్లా జట్టు తరుపున తమ పాఠశాలకు చెందిన విద్యార్థి ఆర్ దత్తు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 27, 28, 29వ తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొననున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి దత్తును పాఠశాల డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, ఈటీ ఆవుల చంద్రశేఖర్ యాదవ్, ఉపాధ్యాయులు అభినందించారు.

పరీక్షల సమయానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మిర్యాలగూడ టౌన్ : ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో ఆర్టీసీ సమయానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మిర్యాలగూడ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్‌పాస్ కలిగి ఉండి, హాల్‌టికెట్ చూపించి రెగ్యులర్ రూట్‌లో కాకపోయినప్పటికీ పరీక్ష కేంద్రానికి వెళ్లొచ్చని తెలిపారు. పరీక్ష సెంటర్ రూట్లలో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. పల్లె వెలుగు బస్‌పాస్ ఉన్న అనుమతిస్తారని తెలిపారు.

పాదయాత్ర కరపత్రం, పోస్టర్ ఆవిష్కరణ



కరపత్రం, పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్ : చట్టసభల్లో బీసీల వాటా కోసం చేపడుతున్న మహాపాదయాత్ర ప్రచార కరపత్రం, పోస్టర్‌ను మంగళవారం స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శివరామకృష్ణ, రాష్ట్ర నేత సరికొండ రుషికేశ్వర్‌రాజు, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పాగుల సైదులు గౌడ్‌లు మాట్లాడారు. ఈ పాదయాత్ర ద్వారా 60శాతం ఉన్న బీసీల జనాభాకు 15శాతం రిజర్వేషన్లు రిజర్వేషన్లు కల్పించడాన్ని ఎండగడుతూ బీసీల హక్కుల సాధన ధ్యేయంగా ఈ పాదయాత్రను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న గౌడ్, రజక సంఘం రాష్ట్ర నేత నాగభూషణం, బీసీ సంఘం రాష్ట్ర నేత జయరాజు, పట్టణ రజక సంఘం అధ్యక్షులు సుధాకర్, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గంజాయి మత్తు.. యువత చిత్తు

- గ్రామాల్లో జోరుగా విక్రయాలు
- ప్రధాన అడ్డాలుగా శివారు ప్రాంతాలు
- మత్తుకు బానిస అవుతున్న యువత
- అరికట్టాలని కోరుతున్న ప్రజలు



మిర్యాలగూడ టౌన్ : గంజాయి మత్తుకు పల్లె, పట్టణ యువత చిత్తవుతుంది. పట్టణ, గ్రామ శివారులోని వ్యవసాయ ప్రాంతాలే అడ్డాలుగా మార్చుకొని గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాల అమ్మకాలు జరుగుతున్నాయి. పట్టణాలకే పరిమితం అవుతున్న గంజాయి విక్రయాలు పల్లెల్లోకి పాకాయి. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాద్గార్‌పల్లి గ్రామ శివారులో ఉట్లపల్లికి వెళ్లే బ్రిడ్జి వద్ద, యాద్గార్‌పల్లి నుంచి అవంతీపురానికి వెళ్లే రోడ్డులోని ముక్కల కాల్వ సమీపంలో, ఆలగడప మూసీ బ్రిడ్జి కింద, వెంకటాద్రిపాలెం గ్రామ శివారులోని రైల్వే స్టేషన్ గోదాం, తడకమళ్ల, తక్కెళ్లపాడు, కొత్తగూడెం, వాటర్ ట్యాంకు తండా మంచినీటి ట్యాంకుతో పాటు పలు గ్రామాల శివారులోని పాలేరు వాగు, నందిపాడు శివారులోని ఐలాపురానికి వెళ్లే రోడ్డులోని ఒక వ్యవసాయ పొలం వద్ద, జప్తీవీరప్పగూడెం గ్రామ శివారు, చింతపపల్లి రోడ్డులోని ఇందిరమ్మ కాలనీ శివారులో అడ్డాలను ఏర్పాటు చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. అదే విధంగా మిర్యాలగూడ పట్టణంలోని ముత్తిరెడ్డికుంట, చైతన్యనగర్‌లోని బోటింగ్ పార్క్, రైల్వే స్టేషన్ పరిధిలోని చిల్లాపురంకు వెళ్లే రోడ్డులో చెట్ల పొద అడ్డాలుగా ఏర్పాటు చేసుకొని ఈ వ్యవహారం సాగిస్తున్నారని అనుమానాలను ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

ముందుగా ఉచితంగా అలవాటు చేసి

కొంత మంది అక్రమార్కులు గంజాయి ఆశ చూపించి విద్యార్థులు, యువకులే లక్ష్యంగా వల వేస్తున్నారు. ముందుగా కళాశాల పిల్లలను మచ్చిక చేసుకొని యువతకు ముందుగా ఉచితంగా అలవాటు చేస్తున్నారనే ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఒక వైపు మత్తుకు బానిసలవుతున్న యువత జల్సాలకు అలవాటు పడి ఇంట్లో తల్లిదండ్రులకు తెలిసి మందలిస్తే వారిపైకే తిరగబడుతున్నారు. అదే విధంగా మత్తు పదార్థాల కోసం దొంగతనాలకు కూడా అలవాటు పడుతున్నట్లు తెలుస్తుంది. దీంతో తల్లిదండ్రులు బయటకు చెప్పుకోలేక మనోవేదనకు గురవుతున్నారు. మత్తుకు అలవాటు పడుతున్న యువత రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారనే ప్రచారం కూడా సాగుతుంది. దీంతో కుటుంబాలు చిన్న భిన్నం అవుతున్నాయి. పోలీసు అధికారులు ఇప్పటికైనా ఆయా ప్రాంతాల్లో గట్టి నిఘాను ఏర్పాటు చేసి గంజాయి మత్తుకు బానిసలవుతున్న యువతను కాపాడాలని యువత తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం



మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఎక్కడైన గంజాయి ఆనవాళ్లు కనిపిస్తే పోలీస్ స్టేషన్‌గాని, డయల్ 100 నంబర్‌కు సమాచారం అందించాలి. గంజాయి విక్రయదారులపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశాం. యువత గంజాయికి బానిస కావొద్దు. అలాగే మీ జీవితాలను నాశనం చేసుకోవద్దు. గ్రామాల్లో ఎవరైన గంజాయి అమ్మినట్లు తెలిస్తే సమాచారం అందించాలి. వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. ఈ విషయంపై గ్రామాల ప్రజలు పోలీసులకు అన్ని విధాలుగా సహకరించాలి.

– సతీష్ వర్మ, ఎస్ఐ, మిర్యాలగూడ రూరల్

మిర్యాలగూడ బడ్జెట్ రూ.72.52 కోట్లు

- ఆమోదించిన మున్సిపల్ పాలకవర్గం
- పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి
- మున్సిపల్ ఛైర్మన్ తిరునగరు భార్గవ్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ తిరునగరు భార్గవ్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీ 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన రూ 72కోట్ల 52లక్షల 10వేల బడ్జెట్‌ను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ ఛైర్మన్ తిరునగరు భార్గవ్ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. అకౌంటెంట్ ధనుంజయ బడ్జెట్ అంచనాలు, ఎజెండాను చదివి వినిపించారు. మున్సిపాలిటీలో 22 వేల వరకు గృహాలు, 2,147 వరకు వ్యాపార భవన సముదాయాలు, 1,588 వరకు మిశ్రమ భవనాలు ఉన్నాయని అన్నారు. వీటి ద్వారా మున్సిపాలిటీకి 9.33 కోట్ల వరకు ఆస్తి పన్నులు వసూలు అవుతుందని తెలిపారు. నాన్ టాక్స్ రూపంలో రూ.10.51కోట్ల వరకు ఆదాయం వస్తుందని నివేదికలో వివరించారు. ప్రధానంగా జీతాల కోసం 9.62 కోట్లు, ఇతర చార్జీలతో పాటు గ్రీనరి నిర్వహణ, కరెంటు కింద రూ.15.16 కోట్లు, డిపాజిట్ల ద్వారా రూ.33లక్షల వరకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. మొత్తం మున్సిపాలిటీకి రూ.20.17కోట్ల వరకు ఆదాయం వస్తుందని, అదే విధంగా ప్రతి సంవత్సరం 1.34 కోట్ల రూపాయల వరకు జనరల్ ఫండ్ ద్వారా ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు నివేదికలో చూపించారు. మున్సిపాలిటీ ఆదాయ, రాబడుల అంచనాలను పరిగణంలోకి వాస్తవిక బడ్జెట్‌ను రూపొందించడం జరిగిందని మున్సిపల్ ఛైర్మన్ తిరునగరు భార్గవ్, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌లు తెలిపారు. బడ్జెట్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు. రాబోయే వేసవి కాలంలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని అన్నారు. మున్సిపాలిటీలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ భార్గవ్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో, కౌన్సిలర్లు బండి యాదగిరిరెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, ఉదయ్ భాస్కర్, సలీం, జానీ, తిరునగరు నాగలక్ష్మి, అమృతం దుర్గాసత్యం, ఉబ్బపల్లి వెంకమ్మ, పందిరి అనిత, కె. నాగలక్ష్మి, మల్గం రమేష్, బంటు రమేష్, చిలుకూరి సక్కుబాయి, కమిలి, మున్సిపల్ అధికారులు సోమయ్య, అక్బర్, పాతేపాక బక్కయ్య, కళ్యాణి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో అధికారులది కీలక పాత్ర



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

నిడమనూరు : సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున గ్రామాల అభివృద్ధిలో ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్న అధికారులది కీలక పాత్ర ఎమ్మెల్సీ కోటిరెడ్డి అన్నారు. మంగళవారం నిడమనూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మండల కేంద్రంలో నకిలీబిల్లుల వ్యవహారంపై అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం సర్పంచ్‌లు స్థానంలో ఉన్న అధికారులు గైర్హజరు కావడం మంచిది కాదన్నారు. ఎర్రబెల్లి ఎంపీటీసీ మొల్క సుగుణశ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మార్చి నెలలో ఎర్రబెల్లి లింగమంతుల స్వామి జాతర జరుగనున్నదన్నా నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీఓ వెంకటేశం స్పందిస్తూ ఎర్రబెల్లి చుట్టు పక్కల ఉన్న గ్రామ పంచాయతీల నుంచి వాటర్ ట్యాంకర్లను జాతర సందర్భంగా అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోటిరెడ్డిని సభ్యులు శాలువాతో సన్మానించారు. ఎంపీపీ బొల్ల జయమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జెడ్పీటీసీ రామేశ్వరిమట్టారెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అంజయ్య, వెనిగండ్ల సింగిల్ విండో ఛైర్మన్ కేవీ రామారావు, ఎంపీడీఓ గుర్రం వెంకటేశం, ఎంపీటీసీలు విన్నాదుల రాణి, మంజుల శ్రీనివాస్, అధికారులు మునికృష్ణయ్య, వరలక్ష్మి, గ్రీష్మ, బాలునాయక్, రాజరాజేశ్వరి, శ్రీనివసా, నాయబ్ తమసిల్దార్ రషీద్, వంశీ, ప్రవీన్ రాజ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను వదిలేయడంపై చర్చ

మిర్యాలగూడ టౌన్ : పోలీసులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేయకుండా వదిలేయడంపై మిర్యాలగూడలో చర్చ జరుగుతోంది. మిర్యాలగూడ మండలం తడకమళ్ల, తక్కెళ్లపాడు, వేములపల్లి మండలం కామేపల్లి వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ఫోన్ చేయడంతో వాటిని వదిలేసినట్లు తెలిసింది. ఇదే విషయంపై మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ సతీష్‌వర్మను వివరణ కోరగా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటికి మైనింగ్ ఏడీ నుంచి అనుమతి ఉన్నట్లు ట్రాక్టర్ యాజమానులు చెప్పడంతో వదిలివేశామని తెలిపారు. ఇదే విషయంపై మైనింగ్ ఏడీ వెంకటేశ్వర్లును సంప్రదించగా తాము ఇసుక అనుమతి కోసం మ్యానువల్‌గా అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.

రైల్వే అండర్‌పాస్ నిర్మాణానికి కృషి



నర్సాపురం రైల్వే గేటు వద్ద గ్రామస్తులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రం నర్సాపురం రైల్వే గేటు వద్ద అండర్ పాస్ నిర్మాణానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. దామరచర్ల మండల కేంద్రంలోని నర్సాపురం ఎక్స్‌రోడ్డు వద్ద గల రైల్వే గేటును రైల్వే అధికారులు తొలగిస్తామనడంతో దామరచర్ల, రాజగట్టు, నర్సాపురం గ్రామాల రైతులు ఎమ్మెల్యేను కలిసి రైల్వే అండర్‌పాస్ నిర్మించాలని కోరారు. మంగళవారం ఎమ్మెల్యే సందర్శించి మూడు గ్రామాల రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైల్వే అండర్‌పాస్ నిర్మాణానికి తనవంతుగా కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బంటు కిరణ్, బైరం నర్సయ్య, నాయకులు గజ్జల వెంకట్‌రెడ్డి, కందుల శ్యాంసుందర్‌రెడ్డి, గజ్జల లింగారెడ్డి, సైదిరెడ్డి, వెంకటేశ్వర్లు, మజ్జు, ఏసు, శాంతి, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భగత్, జెడ్పీ వైస్ ఛైర్మన్ పెద్దులు

హాలియా : అనుముల మండలంలోని మారేపల్లి గ్రామంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామిఅమ్మవార్ల రథోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో సాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, జెడ్పీ వైస్ ఛైర్మన్ ఇరిగి పెద్దులు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్ యాదవ్, వైస్ ఎంపీపీ మాలే అరుణసత్యనారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, దేవాలయ ఛైర్మన్ మట్టపల్లి వెంకన్న, నాయకులు సురభి రాంబాబు, మాజీ సర్పంచ్‌లు మజ్జిగపు వెంకట్రాంరెడ్డి, మాలే ధర్మారెడ్డి, చెదురుపల్లి రాములు, వెంకన్న పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామి రథయాత్ర గ్రామంలోని పురవీధుల్లో కొనసాగింది. ఈసందర్భంగా కోలాటం బృందం సభ్యులు వేసిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ రథోత్సవ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వెంకన్న, దేవాలయ అధికారి నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ సరిత శ్రీను, మాజీ ఛైర్మన్ శ్రీకాంత్, నాయకులు తదితరులు ఉన్నారు.

సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో వీడ్కోలు సమావేశం



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కరస్పాండెంట్ అలుగుబెల్లి శిరీష మాట్లాడుతూ దృఢ సంకల్పంతో లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. వీడ్కోలు సమావేశం అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి పలువురిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి



మాల్ వెంకటేశ్వరనగర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ కృష్ణకుమారి

చింతపల్లి : మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ కృష్ణకుమారి కోరారు. మంగళవారం మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియోపై వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. వైద్య సిబ్బంది విధులకు నిర్లక్ష్యం వహించకుండా పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఆమె వెంట వైద్యాధికారి శ్రీదేవితో పాటు వైద్య సిబ్బంది ఉన్నారు.

అడవిదేవులపల్లి : మండలంలో 22 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఈ కేంద్రాల్లో 0 –5ఏళ్లలోపు పిల్లలందరికీ పోలీయో చుక్కలు వేయించాలని మండల వైద్యాధికారి ఉపేందర్ కోరారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 22 పల్స్ పోలియో కేంద్రాల్లో 44టీంలు పనిచేస్తాయన్నారు. మార్చి 3న మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు ప్రభుత్వ పాఠశాలలు, బస్టాండ్‌లతో పాటు ప్రధాన కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. అదే విధంగా 4, 5తేదీల్లో వైద్య ఈ సమావేశంలో మండల తహసీల్దార్ శ్రీరాం సురేశ్‌కుమార్, ఎంపీడీఓ కరుణాకర్ రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పుంజాల శివశంకర్ సేవలు ఎనలేనివి



హాలియా : శివశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ : కేంద్ర న్యాయశాఖ మాజీ మంత్రి పుంజాల శివశంకర్ ఏడో వర్ధంతిని మున్నూరు కాపు యువత ఆధ్వర్యంలో దామరచర్ల మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాల శ్రీనివాస్ పుంజాల శివశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు బాల సుజాతశ్రీనివాస్, వీరశేఖర్, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, వాతంశెట్టి సైదయ్య, వీరాంజనేయులు, సైదారావు, శ్రీనివాస్ నాయుడు, బాల నాగార్జున, భాస్కర్‌రావు, దుగ్గె సైదులు, డెగాల సైదులు, వెంకటేశ్వర్లు, దుర్గారావు పాల్గొన్నారు.

మాజీ మంత్రి శివశంకర్‌కు నివాళి

హాలియా : హాలియా మున్సిపాలిటీలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర మాజీ మంత్రి పుంజల శివశంకర్ ఏడో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీను, హాలియా మున్సిపాలిటీ అధ్యక్షుడు నరసింహ, ప్రధాన కార్యదర్శి కొత్త వెంకటేష్, కోశాధికారి నారాయణ, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



నాగార్జున సాగర్ : హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న కళాశాల సిబ్బంది

నాగార్జునసాగర్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి నిర్వహించే ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ దార పాండయ్య తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన అనుమంతించమని తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 433మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 487మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు.

మిర్యాలగూడ : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికిగాను అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలో ఆరు పరీక్షా కేంద్రాల్లో మొదటి రోజు 1,823 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆయా పరీక్షా కేంద్రాలకు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్‌లను నియమించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష జరిగే సమయంలో పట్టణంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని అధికారులు ఇప్పటికే ఆదేశించారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

త్రిపురారం : మండలంలోని బాబుసాయి పేట గ్రామంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ మువ్వా వేణు గోపాల స్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 28న విశ్వక్సేన పూజ, భగవత్ పుణ్యావాహచనం, రక్షాబంధనం, మత్సం గ్రహణము, అంకురార్పణ 29న అగ్నిముఖం, ధ్వజారోహణము(గరుడముద్ద), బేరి పూజా, దేవాతాహ్వాణం మార్చి 1న కల్యాణ మహోత్సవం, అన్నదాన కార్యక్రమం సాయంత్రం స్వామి అమ్మవారి గ్రామ సేవ ఊరేగింపు, 2న హోమం, పూర్ణహుతి, చక్రస్నానం, చక్రతీర్థం, ద్వాదశ ఆరాధన, శ్రీ పుష్పయాగం, ద్వాదశ ప్రదక్షణలు, రక్షాబంధన, విమోచనము, ఆశీర్వదం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం



డిండి : చెర్కుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు



పెద్దవూర : చింతపల్లి ప్రాథమిక పాఠశాలలో..

పెద్దవూర : మండలంలోని చింతపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా, ఉన్నతాధికారులుగా, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి ఒక్కరోజు బాధ్యతలను నిర్వర్తించారు.అనంతరం ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం రాము, పాఠశాల హెచ్ఎం నిర్మల, కె.శ్రీనివాస్, చంద్రశేఖర్, సీఆర్‌పీ వెంకటయ్య పాల్గొన్నారు.

డిండి: మండల పరిధిలోని చెర్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు చేసిన బోధన పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీరు అందేలా చర్యలు తీసుకుంటాం



పెద్దదేవులపల్లిలో నీటి సరఫరా వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

త్రిపురారం : ప్రతి ఇంటికీ భగీరథ నీరు సక్రమంగా అందేవిధంగా చర్యలు తీసుకుంటామని భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పెద్ద దేవులపల్లి గ్రామనికి చెందిన ఇరిగి క్రాంతి కుమార్ గ్రామంలో భగీరథ నీరు సక్రమంగా రావడంలేదని ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు పెద్దదేవులపల్లి, నర్లకంటిగూడెం గ్రామంలో భగీరథ నీటి సరఫరాపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న వీధుల్లోకి, ఇళ్లకు వెళ్లి భగీరథ నీరు సక్రమంగా వస్తున్నాయా, సమస్యలు ఎంటీ, ఎన్ని ట్యాంక్‌లు ఉన్నాయని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాటర్ ట్యాంక్‌లు పరిశీలించారు. లీకులు ఉండడంతో నీరు రావడంలేదని, ఎప్పుడు పడితే అప్పుడు వస్తున్నాయని గ్రామస్తులు ఎస్ఈకి తెలిపారు. తక్షణమే సమస్యలు గుర్తించి నీరు సక్రమంగా అందేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భగీరథ డిప్యూటీ ఈఈ మధు, ఏఈ మోహన్ గాంధీ, పంచాయతీ కార్యదర్శి రామయ్య, సునీల్, శ్రీకాంత్, ఇరిగి క్రాంతి కుమార్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

హాలియా : ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ సాగర్ డివిజన్ కార్యదర్శి కోరే రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా విద్యార్థులకు తాగునీరు, లైటింగ్, ఫ్యాన్లు వెలుతురు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాసేలా విద్యార్థులను తల్లిదండ్రులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నల్లబెల్లి జగదీష్, డివిజన్ కమిటీ సభ్యులు చందు, సాయి, నవీన్, గోపి, రంగా తదితరులు ఉన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై ఇష్టాన్ని పెంచుకోవాలి



విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎంఈఓ బాలాజీనాయక్

మిర్యాలగూడ : ప్రతి విద్యార్థి సైన్స్‌పై ఇష్టాన్ని పెంచుకోవాలని ఎంఈఓ బాలాజీనాయక్ అన్నారు. నేషనల్ సైన్స్ డే వేడుకలను మంగళవారం పట్టణంలోని శ్రీ సాయి టెక్నో స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 200సైన్స్ ప్రాజెక్టులను తయారు చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ సైంటిఫిక్ ఆలోచనలను అలవర్చుకొని మంచి పేరు సంపాదించాలన్నారు. ఉత్తమ సైన్స్ ప్రాజెక్టులు చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కందాల శ్రీనివాసచారి, ఉపాధ్యాయులు వసంత, వరలక్ష్మీ, సత్యవతి, పుష్పమ్మ, ఉమా, కవిత, లావణ్య, సౌమ్య, అనూష, విజయలక్ష్మీ, ఫర్జాన, రవి, వెంకటేశ్వర్లు, రఫీ పాల్గొన్నారు.